సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం । 6 । జూలై । 2024





## పసుపు సాగుతో.. పసిడి సిరులు
జిల్లాలో ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో వాణిజ్య పంటగా పసుపు సాగుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు.
-8లో



## గిరిజనుల భూమి కబ్జా
గిరిజనులు పంటలు సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న భూమిని ఓ నాయకుడు దౌర్జన్యంగా కబ్జా చేసి రాత్రికి రాత్రే మామిడి చెట్లు నాటేశారు.
-8లో

గరిష్టం/కనిష్టం
35.6/26.8

## వాతావరణం
జిల్లాలో శుక్రవారం 26.8 - 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### నేడు కొత్త కలెక్టర్ రాక
కడప సెవెన్‌రోడ్స్: కడప కలెక్టర్‌గా నియమితులైన లోతేటి శివశంకర్ శనివారం జిల్లాకు రానున్నారు. ఆయన తిరుమల నుంచి బయలుదేరి కడపకు చేరుకోనున్నారు. ఉదయం 10.45 గంటలకు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు కలెక్టరేట్ వర్గాల సమాచారం.

### ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: అశోక్‌లైల్యాండ్ సంస్థ వారు అత్యాధునిక టెక్నాలజీ బీఎస్–6 బస్సులపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని డీపీటీఓ కార్యాలయంలో కడప, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, జమ్మలమడుగు ఆర్టీసీ డిపోల డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన వాహనాలను సంస్థ కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రతి డ్రైవరు కొత్త టెక్నాలజీ తెలుసుకుని దానిని అందిపుచ్చుకుని డ్రైవింగ్ చేస్తే మంచి మైలేజీతోపాటు యూనిట్ లైఫ్, బస్సు లైఫ్ పెంచడం జరుగుతుందన్నారు. అశోక్‌లైల్యాండ్ ట్రైనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ బస్సు టెక్నాలజీ గురించి వివరించారు. తాము ఇచ్చిన శిక్షణను డ్రైవర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ డిపోలకు చెందిన 32 మంది డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం వారిని ఫీల్డ్‌కు తీసుకెళ్లి పలు అంశాలను వివరించి అనుమానాలను నివృత్తి చేశారు.

### చేపలు వేట చేపడితే చర్యలు




మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ కిరణ్‌కుమార్

కడప అగ్రికల్చర్: ప్రాజెక్టులు, జలాశయాల్లో నిషేధ సమయంలో ఎవరైనా చేపల వేట చేసినా, చేపలను పట్టినా కఠిన చర్యలు ఉంటాయని జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు శాంతి పేర్కొన్నారు. చేపల వేట నిషేధంపై శుక్రవారం కడపలోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో చేపల వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో లైసెన్స్ జారీ చేసిన గండికోట ప్రాజెక్టు, బ్రహ్మంసాగర్ జలాశయంతోపాటు సోమశిల వెనుక జలాల్లో జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు 62 రోజులపాటు సహజంగా చేపల సంతానోత్పత్తి కాలం కాబట్టి చేపల వేట నిషేధాన్ని విధించినట్లు తెలిపారు. ఈ సమయంలో ఏ వ్యక్తి అయినా సదరు జలాశయాలలో చేపలు కొనుగోలు చేసి, రవాణా చేసినా వారి వాహనాలను జప్తు చేయడం జరుగుతుందన్నారు. వ్యాపారులు ఇతర జిల్లాల నుంచి గానీ స్థానిక చెరువుల నుంచి గానీ చేపలను కొనుగోలు చేసి రవాణా చేయాల్సి వస్తే మత్స్యశాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీఓ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పంటలకు పరపతి..
# పెరిగిన రుణ పరిమితి

- వ్యవసాయ రుణ లక్ష్యం రూ.11138 కోట్లు
- పరిశ్రమల కింద రూ.2745 కోట్లు
- బ్యాంకులకు చేరిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నివేదికలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు





కడప అగ్రికల్చర్: వ్యవసాయ ఆధారిత జిల్లా రైతాంగానికి, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధితోపాటు ఇతర రుణాల మంజూరు విషయంలో అధికార యంత్రాంగం చొరవ చూపుతోంది. వ్యవసాయ అభివృద్ధి కోసం ఏటా వేల మంది రైతులకు అర్హత మేరకు పంట రుణాలు మంజూరు చేస్తూ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. కానీ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం నుంచి రైతులకు రావాల్సిన రైతు భరోసా లభించలేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలకు బ్యాంకులు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. పెరుగుతున్న పెట్టుబడికి అనుగుణంగా రైతులకు రుణాలు అందించనున్నాయి. రైతులకు అందించే పంటల రుణ పరపతిని ఈ ఏడాది పెంచుతూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పెరిగిన పంట రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) నివేదికలు ఆయా బ్యాంకర్లకు చేరాయి.

**2024–25కు ఇవ్వనున్న రుణాల వివరాలు**

తాజాగా పెరిగిన రుణ పరిమితి మేరకు జిల్లాలో అన్ని రంగాలకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరంలో రుణాలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.11138 కోట్లు, పరిశ్రమలకు రూ. 2745 కోట్లు, ఇతర రుణాలకు రూ.899, నాన్ ప్రియారిటీ రంగాలకు రూ.3158 కోట్లు అందించేలా రుణ ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటితోపాటు హౌసింగ్, విద్య, చేతి వృత్తులు, మత్స్య కార, ఎస్‌హెచ్‌జీలతోపాటు పలు రంగాలకు సంబంధించిన రుణాలు కలిపి ఈ ఏడాది మొత్తంగా జిల్లాలోని అన్ని బ్యాంకుల పరిధిలో రూ.17940 కోట్ల రుణాలను అందించడమే లక్ష్యంగా అధికారులు నిర్ధారించారు.

**2024-25కి రుణ ప్రణాళిక వివరాలు**

| రుణాలు | ఏడాది లక్ష్యం (రూ.కోట్లలో) |
|---|---|
| వ్యవసాయం, అనుబంధ రంగాలు | 11138 |
| పరిశ్రమలు | 2745 |
| ఇతర రుణాలు | 899 |
| నాన్ ప్రియారిటీ రుణాలు | 3158 |



పత్తి పంట

**పంటలకు పెరిగిన రుణ పరిమితి ఎకరాకు ఇలా ...**

| పంట పేరు | 2023-24 | 2024-25 |
|---|---|---|
| వరి | 38000–42,000 | 42,000–46 000 |
| జొన్న | 19000–21000 | 21000–23000 |
| మొక్కజొన్న | 38000–42000 | 42000–45000 |
| సజ్జలు | 15000–20000 | 16000–22000 |
| కందులు | 18000–22000 | 20,000–24000 |
| మినుము | 18000–20000 | 20000–22000 |
| పెసలు | 18000–20000 | 20000–22000 |
| శనగ | 28000–32000 | 31000–34000 |
| సన్‌ఫ్లవర్ | 19000–24000 | 21000–26000 |
| వేరుశనగ | 32000–35000 | 35000–38000 |
| పత్తి | 40000–45000 | 44000–50000 |
| పచ్చిమిరప | 68000–75000 | 90000–95000 |
| పసుపు | 90000–100000 | 100000–110000 |

**2018 నుంచి పంట రుణాల (రూ. కోట్లలో) వివరాలు**

| ఏడాది | లక్ష్యం | మంజూరు | శాతం |
|---|---|---|---|
| 2018–19 | 3841 | 4826 | 125 |
| 2019–20 | 4800 | 5600 | 116 |
| 2020–21 | 5500 | 5354 | 97 |
| 2021–22 | 6600 | 7729 | 117 |
| 2022–23 | 4541 | 4979 | 109 |
| 2023–24 | 6676 | 7171 | 107 |
| 2024–25 | 7003 | – | – |

**లక్ష్యం చేరుకునేందుకు చర్యలు**



స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కమిటీ ఉత్తర్వుల మేరకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణ పరిమితి పెరిగింది. చిన్న, సన్నకారు, వరి, ఉద్యానవన రైతులతోపాటు ఎంఎస్ఎంఈఓ, వ్యక్తిగత రుణాలు అందించనున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది రుణ పరిమితి పెంచుతూ రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ నిర్ణయించింది. నిర్దేశిత లక్ష్యం నెరవేరేలా బ్యాంకర్లకు అన్ని మార్గదర్శకాలు అందించాం. అన్ని వర్గాలకు సంబంధించి అర్హత ఉన్న వారికి రుణాలు అందజేయడం జరుగుతుంది.
– జి.జనార్ధనం, లీడ్ బ్యాంక్ మేనేజర్, కడప

## నేడు వైఎస్ జగన్ రాక

- మూడు రోజుల పాటు పర్యటన
- 8న వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొననున్న వైఎస్ జగన్



పులివెందుల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శనివారం పులివెందులకు రానున్నారు. ఆయన ఉదయం 11 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు. 11.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు చేరుకుంటారు. 11.40కి విమానంలో కడప ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు. 12.25కు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 12.35కి కడప ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గాన పులివెందులకు బయలుదేరుతారు. 2 గంటలకు పులివెందులలోని భాకరాపురంలో గల స్వగృహానికి చేరుకుంటారు. అనంతరం ఆయన మూడు రోజుల పాటు పులివెందుల, ఇడుపులపాయలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ నెల 8వ తేదీన దివంగత వైఎస్సార్ 75వ జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు.

## తాళ్లపాక, నందలూరు ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ
రాజంపేట: నందలూరులోని సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు, తాళ్లపాకలో చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావు ఆవిష్కరించారు. శుక్రవారం తిరుపతిలోని తన చాంబర్‌లో టీటీడీ జేఈవో వీరబ్రహ్మంతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ తాళ్లపాక, నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలని ఆదేశించారు.

# రాజంపేట సబ్‌జైలులో భద్రత కరువు!

- దుప్పటిని తాడుగా చేసుకొని..
- జైలులో పట్టపగలే ఖైదీ పరారీ
- విచారణ చేసిన నెల్లూరు డీఐజీ
- జైలు వార్డెన్ సస్పెన్షన్



దుప్పటిని తాడుగా చేసి గోడ దాటుతున్న ఖైదీ (ఊహాజనిత చిత్రం)

రాజంపేట: రాజంపేట సబ్ జైలులో భద్రత కరువైందనే విమర్శలను జైళ్ల శాఖ మూట కట్టుకుంది. ఇదే సబ్ జైలులో గతంలోనూ ఓ ఖైదీ పరారైన సంఘటన విదితమే. తాజాగా గురువారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో హత్య కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీ తన వద్ద వున్న దుప్పటిని తాడుగా చేసుకొని ఎత్తయిన ప్రహరీ గోడ ఎక్కి వెళ్తుంటే జైలు సిబ్బందికి కనపించలేదా? అనే అనుమానాలు వెల్లువెత్తాయి.

**వంట చేసుకునేందుకు వచ్చి...**

రైల్వే కోడూరు రంగనాయకులపేటకు చెందిన షేక్ మస్తాన్ 2018, 2019లో జరిగిన రెండు హత్య కేసులకు సంబంధించి శిక్ష పడడంతో తొమ్మిది నెలలుగా సబ్ జైలులో ఖైదీగా ఉన్నాడు. వంట చేసేందుకు సెల్‌లో నుంచి ఖైదీని బయటికి వదిలారు. వంట చేయడానికి బయటికి వచ్చిన మస్తాన్ దుప్పటిని తాడుగా చేసుకొని గోడ ఎక్కి దాటి పోవాలనుకున్నాడు. అదే ప్లాన్‌ను పక్కాగా అమలు చేశాడు. వార్డెన్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు గేటు వద్ద ఉన్న తరుణంలో అదును చూసి ఖైదీ గోడను అవలీలగా దాటేశాడు. ఖైదీ గోడ దాటేవరకు తోటి ఖైదీలు చూసినా తమకెందుకులే అన్నట్లుగా వ్యవహరించినట్లు కనిపిస్తోంది.

**ఖైదీ తప్పించుకున్న తర్వాత అప్రమత్తం**

ఖైదీ గోడ దాటి వెళ్లిపోయిన తర్వాత సిబ్బంది అప్రమత్తమయ్యారు. విషయం తెలుసుకున్న జైలర్ మల్‌రెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సబ్ జైలుకు పక్కన పట్టణ పోలీస్ స్టేషన్ ఉండగా, అలాగే సబ్ జైలు వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉన్నప్పటికీ ఖైదీ తప్పించుకోవడం గమనార్హం. జైలర్ ఫిర్యాదుపై సీఐ మద్దయ్య ఆచారి కేసు నమోదు చేశారు. ఖైదీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.



రాజంపేట సబ్ జైలు

**జైళ్ల శాఖ డీఐజీ విచారణ**


రాజంపేట సబ్ జైలులో ఖైదీ మస్తాన్ పరారీ సంఘటనపై జైళ్ల శాఖ నెల్లూరు రేంజ్ డీఐజీ రాజేశ్వరరావు శుక్రవారం విచారించారు. పట్టపగలే దుప్పటిని తాడుగా చేసుకొని గోడ దాటి వెళ్లిపోయిన సంఘటనపై డీఐజీ విస్మయం వ్యక్తం చేశారు. జైలు లోపల సిబ్బంది నిర్లక్ష్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన సంఘటనపై నివేదికను జైళ్ల శాఖ ఉన్నతాధికారులకు అందజేయాల్సిన క్రమంలో ఆయన సంఘటన వివరాలు సేకరించారు. సంఘటనకు కారకుడిగా భావిస్తున్న వార్డెన్ శ్రీనివాసులును సస్పెండ్ చేశారు. ఈ విషయాన్ని జైలర్ మల్‌రెడ్డి ధ్రువీకరించారు.

## రాయల్టీ కట్టకుండా దోపిడీ..!

- కొండలను పిండి చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్
- మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

సాక్షి ప్రతినిధి, కడప: గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ రాయల్టీ చెల్లించకుండా దోపిడీ చేస్తున్నారని, కొండలు గుట్టలు పిండి చేస్తున్నారని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు పుట్టా రెడ్‌సిగ్నల్ అనే శీర్షికపై ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. వీడియోను మీడియా సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు మైదుకూరు నియోజకవర్గంలో కొనసాగుతుండేవని, ఆయా ప్రాంతాల్లోని కొండల్ని పిండి చేస్తున్నారని పశువులకు మేత లేకుండా పోతోందని గ్రామీణులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఆపై గ్రావెల్ తరలింపునకు అనుమతులు ఉన్నాయా? రాయల్టీ సక్రమంగా చెల్లించారా అనే విషయాన్ని పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించానని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా కాంట్రాక్టర్ దోపిడీ చేస్తున్న వైనాన్ని అధికారులు పసిగట్టి పనులు నిలిపేశారని ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ స్పష్టం చేశారు.

## 20న అరుణాచలంకు ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని వివిధ డిపోల నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం తిరువణ్ణామలైకి ఈనెల 20వ తేదీన వివిధ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు.

- కడప డిపో నుంచి రాత్రి 9 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. రానుపోను రూ.1072 చార్జీగా నిర్ణయించామన్నారు.
- బద్వేలు డిపో నుంచి ఉదయం 7 గంటలకు అల్ట్రా డీలక్స్ బస్సు పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్ మీదుగా, అలాగే సూపర్ లగ్జరీ బస్సు రాత్రి 7కి ఇదే రహదారిలో వెళుతుందన్నారు. ఇందులో చార్జీ రూ.1688 ఉంటుందన్నారు.
- మైదుకూరు డిపో నుంచి ఉదయం 6 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు పోరుమామిళ్లలో బయలుదేరి కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుందని, ఇందులో చార్జీ రూ.1295 ఉంటుందన్నారు. అలాగే మరొక బస్సు మైదుకూరులో సాయంత్రం 6 గంటలకు ఇదే మార్గంలో వెళుతుందన్నారు. ఇందులో చార్జీ రూ.1024గా ఉందన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 5 గంటలకు, 6 గంటలకు బస్సులు మైదుకూరు, కడప మీదుగా తిరువణ్ణామలైకి వెళ్తాయన్నారు. వీటిలో చార్జీ రూ.1273గా ఉందన్నారు.
- జమ్మలమడుగు డిపో నుంచి ఉదయం 5.30 గంటలకు బయలుదేరే బస్సులో రూ. 1352 చార్జీగా ఉందన్నారు. మరో బస్సు సాయంత్రం 5 గంటలకు బయలుదేరుతుందన్నారు. ఇందులో చార్జీ రూ.1568గా ఉందన్నారు. ఈ బస్సులు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా వెళతాయన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరే బస్సు పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా తిరువణ్ణామలైకు వెళుతుందన్నారు. ఇందులో చార్జీ రూ.1242గా ఉందన్నారు.
- భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుగానే తమ టిక్కెట్లను రిజర్వు చేసుకోవాలని ఆయన సూచించారు.

# టీకా.. ఆరోగ్యం ఎంచక్కా

దాదాపు 40 ఏళ్ల క్రితం స్మాల్ పాక్స్ (పెద్ద అమ్మవారు) ఎక్కువగా ఉండేది. అప్పట్లో ఈ వ్యాధి నిరోధానికి మాత్రమే ఒక టీకా (వ్యాక్సిన్)ను వేసేవారు. తరువాత కాలంలో వైద్య రంగంలో పెను మార్పులు వచ్చాయి. క్రమేణా వివిధ రకాల వ్యాధులకు కొత్త టీకాలు అందుబాటులోకి రావడం మొదలైంది. ఈ టీకాలు భవిష్యత్తులో వచ్చే వ్యాధులను చిన్నప్పుడే నిరోధిస్తున్నాయి. తల్లి గర్భం నుంచి శిశువు జన్మించి.. ఎదిగే క్రమంలో ఒక ప్రణాళిక ప్రకారం వేసే టీకాలు ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తున్నాయి.

- చిన్నారులకు 'వ్యాక్సిన్'లు రక్ష
- భవిష్యత్తులో వచ్చే వ్యాధులకు అడ్డుకట్ట
- పెద్దల చైతన్యమే పిల్లల భవితకు దోహదం



కడప రూరల్: శిశువు జన్మించినప్పటి నుంచి ఎదిగే క్రమంలో అనారోగ్య ఆటు పోట్లు ఎదురవుతుంటాయి. ఈ సమస్యల పరిష్కారానికి టీకాలు దోహదపడుతాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు క్రమం తప్పకుండా ఈ వ్యాక్సిన్‌లను వేయించడం ద్వారా వారికి బంగారు భవితను ఇచ్చిన వారవుతారు.

**జిల్లాలో ఒక నెలకు 4 వేల జననాలు**

జిల్లా వ్యాప్తంగా అధికారికంగా దాదాపుగా ఒక రోజుకు 130, ఒక నెలకు 4 వేలు, ఒక ఏడాదికి 48 వేలకు పైగా జననాలు నమోదవుతున్నాయి. అంటే దాదాపుగా ఆ చిన్నారులంతా టీకాలు వేయించుకుంటున్నారు. ఈ టీకాలు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా లభిస్తాయి. ఈ వ్యాక్సిన్‌లపై పెద్దలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో పిల్లల ఆరోగ్య విషయంలో పెద్ద మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుంది. వైద్యుల సూచనల ప్రకారం నడుచుకుంటే చిన్నారుల ఆరోగ్యం భద్రంగా ఉంటుంది. ఈ విషయంలో పట్టణ ప్రాంతాల వారు ముందంజలో ఉంటున్నట్లుగా తెలుస్తోంది.

**అపోహలు వీడాలి**

జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఈ టీకాలను వాడకూడదనే ఒక అపోహ ఉంది. అది ఎంత మాత్రం నిజం కాదు. మోస్తరుగా జ్వరం, జలుబు, దగ్గు వచ్చినా ఈ వ్యాక్సిన్‌ను వాడవచ్చు. లేదా వైద్యుల సూచనల ప్రకారం పాటిస్తే ఇంకా మంచిది.


**ఎప్పుడు.. ఎక్కడ వేస్తారంటే..**

సాధారణంగా గర్భిణి దశతోపాటు బిడ్డ జన్మించినప్పటి నుంచి ఈ వ్యాక్సిన్‌లను ప్రభుత్వ ఆసుపత్రులైన కడప రిమ్స్‌లో ప్రతి రోజూ వేస్తారు. అలాగే జిల్లాలోని 645 సచివాలయాల్లో ప్రతి బుధవారం, శనివారం, 80 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక కేంద్రాల్లో ప్రతి బుధవారం ఉచితంగా వ్యాక్సిన్‌లు వేస్తారు. ఈ టీకాలు బయట కొనాలంటే చాలా ఖరీదైనవి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పొందవచ్చు. అలాగే వైద్యులు చిన్నారులకు ఎప్పుడు ఏ టీకా వేయాలనేది సూచిస్తారు. ఆ ప్రకారం పిల్లలకు టీకాలు వేయాల్సి వుంటుంది. అలాగే ప్రభుత్వం ఇటీవల కాలంలో పెద్దలకు కూడా 'అడల్ట్ బీసీజీ' టీకాను అందుబాటులోకి తెచ్చింది. అనుమానాలు ఏవైనా ఉంటే వైద్యులను సంప్రదించాలి.

**వ్యాధి నిరోధక టీకాల పట్టిక క్రమం**


| వ్యాక్సిన్ పేరు | ఎప్పుడు వేయాలి | టీకా వేసేవిధానం | నివారించే వ్యాధి |
|---|---|---|---|
| బీసీజీ | పుట్టిన వెంటనే | చర్మానికి | క్షయ |
| హెపటైటీస్ | పుట్టిన వెంటనే | కండరాల లోపల | కామెర్లు, కేన్సర్ |
| ఓపీఓ పోలియో | 6, 10, 14 వారాలకు | నోటి ద్వారా | పోలియో |
| రోటా వైరస్ | 6, 10, 14 వారాలకు | నోటి ద్వారా | వైరల్ డయేరియా |
| ఎఫ్ఐపీఓ | 6, 14 వారాలకు | చర్మంలోకి | పోలియో |
| పీసీవీ | 4, 14 వారాలకు 9 నెలలకు | కండరాల్లో | న్యూమోనియా |
| పెంటా వాలెంట్ | 6, 10, 14 వారాలకు | కండరాల్లో | న్యూమోనియా, కీళ్లవాతం, ధనుర్వాతం |
| తట్టు రెబుల్లా | 9, 12 నెలల్లోపు | చర్మం కింద | తట్టు రెబుల్లా |
| జేఈఈ | 9, 12 నెలల్లోపు | ఎడమచేతి చర్మం | మెదడువాపు, ధనుర్వాతం |
| డీపీటీ | 16, 24 నెలలకు (బూస్టర్–1 డోస్) 5, 6 ఏళ్లకు | కండరాల్లో | కోరింత దగ్గు ధనుర్వాతం |
| టీపీ/టీడీ | 10, 16 ఏళ్లల్లోపు | కండరాల్లో | కోరింత దగ్గు |
| విటమిన్–ఏ | 9,12, 16, 24 నెలలకు | నోటి ద్వారా | రేచీకటి |

**క్రమం తప్పకుండా వేయించాలి**



చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు టీకాలు ఎంతగానో దోహదపడుతాయి. వైద్యులు సూచించిన విధంగా టీకాలు వేయించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు. పిల్లల ఆరోగ్య పరిరక్షణలో పెద్దలు అవగాహన కలిగి ఉండాలి.
– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నీ ఉచితం**



ఈ టీకాలను అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వేస్తారు. పిల్లలకు సూచించిన విధంగా టీకాలు వేయడం వల్ల.. వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.
– డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

Sankar Reddy's కోచింగ్ సెంటర్
సాయి బాలాజీ
ఫ్రీ డెమో On 07.07.2024 10 A.M (ఆదివారం) DSC (SGT, SA) GROUP-II
RTC
9966787371, 8886142609

## క్లుప్తంగా

### భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు

మదనపల్లె : ద్విచక్ర వాహనం అదుపుతప్పి భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎం పంచాయతీ రైల్వే గేట్ సమీపంలో నివాసముంటున్న భవన నిర్మాణ కార్మికుడు అశోక్(30) సొంత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని సీటీఎం క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించపోయి అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని గమనించిన స్థానికులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### వేడినీరు పడి చిన్నారికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ప్రమాదవశాత్తూ వేడి నీరు చిన్నారి శరీరంపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. పెద్దమండ్యం మండలం పాపేపల్లె పంచాయతీ పరిధిలోని టి.తురకపల్లెకు చెందిన రెడ్డిబాషు కుమారుడు పి.ఖాసిమ్‌ఖాన్(4) ఇంట్లో ఆడుకుంటున్నాడు. తల్లి వంట చేస్తుండగా.. ఖాసిమ్ ఖాన్ ఆడుకుంటూ వేడి నీటి పాత్రను శరీరంపై పోసుకోవడంతో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### చోరీని అడ్డుకున్నందుకు వ్యక్తిపై దాడి


గాయపడిన మునగ యానాదయ్య (ఫైల్)

నందలూరు : మండలంలోని టంగుటూరులో ఓ వ్యక్తిపై దాడి చేసి నగదు, బంగారు చోరీ చేసిన సంఘటనలో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్‌జహీర్ తెలిపారు. పగడాల సంతోష్ అనే వ్యక్తి ఈ నెల 1వ తేదీన మధ్యాహ్నం మునగ యానాదయ్య ఇంట్లో చొరబడి రూ.57 వేల నగదు, రెండు తులాల బంగారు నగ చోరీ చేశారు. ఇది గుర్తించిన యానాదయ్య అడ్డుకునేందుకు ప్రయత్నించగా స్క్రూ డ్రైవర్‌తో దాడి చేయడంతో అతడికి రక్తగాయాలయ్యాయి. యానాదయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### రెండు ద్విచక్ర వాహనాల చోరీ

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలో రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. స్థానిక ఖాజీవాడకు చెందిన జహీర్, లాల అనే వ్యక్తులు గురువారం రాత్రి తమ ఇళ్ల వద్ద ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేశారు. శుక్రవారం ఉదయం లేచి చూడగానే వాహనాలు కనిపించకపోవడంతో చుట్టుపక్కలా గాలించారు. కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నాలుగు రోజుల్లో వరుసగా నాలుగు ద్విచక్ర వాహనాలు చోరీకి గురవడం ఆందోళన కలిగిస్తోంది.

# పసుపు సాగుతో.. పసిడి సిరులు

- పంటలో మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడులు
- ధర బాగుండడంతో సాగుకు ఆసక్తి చూపుతున్న రైతు
- 2024-25లో 2446 ఎకరాల్లో సాగు చేయడమే లక్ష్యం
- జిల్లాలో ఇప్పటికే 250 ఎకరాల్లో వాణిజ్య పంట సాగు

**వాణిజ్య పంటల్లో పసుపు పంట రారాజు. జిల్లాలో ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండడంతో వాణిజ్య పంటగా పసుపు సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మేలైన యాజమాన్య పద్ధతులతోపాటు నాణ్యమైన విత్తనం వేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. భూమిని బాగా కలియదున్ని ఎరువు వేసుకుని సిద్ధం చేసుకున్న రైతు వర్షం ఆధారంగా, బోర్ల కింద గానీ పసుపు పంట సాగు చేసేందుకు సంసిద్ధమవుతున్నారు.**


కొమ్ములను సిద్ధం చేస్తున్న రైతులు

కడప అగ్రికల్చర్ : ఉమ్మడి జిల్లాలోని ఖాజీపేట, మైదుకూరు, దువ్వూరు, పోరుమామిళ్ల, సిద్ధవటం, ఒంటిమిట్ట, సికె.దిన్నె మండలాల్లో అధికంగా, మిగిలిన ప్రాంతాల్లో స్వల్పంగా రైతులు పసుపు సాగు చేస్తారు. ఈ నేపథ్యంలో మధ్యకాలిక రకాలను జూన్ మొదటి పక్షంలో, దీర్ఘకాలిక రకాలను జూలై రెండో పక్షంలో విత్తుకుంటే మంచి దిగుబడులను సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఉద్యాన విభాగం శాస్త్రవేత్త మానస తెలిపారు. మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు వారు సూచిస్తున్నారు.

**నేల తయారీ...**

పసుపు సాగుకు బలమైన నేలలు శ్రేష్టమైనవి, గరప, మురుగు నీటి పారుదల ఉన్న నేలలు కూడా అనుకూలం. బరువైన నల్లరేగడి, చౌడు, క్షార భూములు పనికి రావు, ఉదజని సూచిక 5-7.5 మధ్య ఉండి సేంద్రీయ కర్బనం ఎక్కువగా ఉన్న నేలల్లో పసుపు పంట బాగా పడుతుంది. వేసవిలో భూమిని లోతుగా గుల్లగా 6 లేక 8 సార్లు దున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు పది టన్నుల పశువుల ఎరువు అంతే మెతాదులో చెరువు మట్టి వేసి కలియదున్నాలి.

**విత్తన ఎంపిక ఇలా...**

విత్తన కొమ్మును ఆరోగ్య వంతమైన మొక్క నుంచి ఎంపిక చేసుకోవాలి. తల్లి కొమ్ము, పిల్ల కొమ్ము నాటడానికి వినియోగించుకోవచ్చు. 6-8 సెంటీ మీటర్ల పొడవుతో, 20-30 గ్రాముల బరువుతో దృఢంగా ఉండే మొగ్గలున్న పిల్లల కొమ్ములు అనువుగా ఉంటాయి. విత్తే లోతు 8 లేక 12 సెంటీమీటర్ల ఉండాలి.

**విత్తన శుద్ధి ఇలా...**

పసుపులో విత్తన శుద్ధి కీలకమైనది. శుద్ధి చేస్తే విత్తనం ద్వారా సక్రమించే దుంప, వేరు కుళ్లు, తాటాకు తెగులు, ఆకుమచ్చ తెగులుకు కారణమైన శిలీంద్రాలు నాశనమవుతాయి. భూమిలో హానికర శిలీంద్రాలు కొంత కాలం వరకు విత్తనానికి ఆశించవు. తొలిసారి విత్తన శుద్ధి చేసి ఆరబెట్టిన తరువాత నీడ ప్రదేశంలో కుప్పగా పోయాలి. నాటేటపుడు రెండోసారి శుద్ధి చేయాలి. మొలక విరగకుండా జాగ్రత్త వహించాలి. లీటరు నీటికి మూడు గ్రాముల మెటలాక్సికల్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ లేదా రిడోమిల్ ఎం.జెడ్ కలిపిన ద్రావణంలో 40 నిమిషాలు ఉంచి బయటకు తీసి నీడలో ఆరబెట్టి తరువాత నాటుకోవాలి. విత్తన పసుపుకు పొలుసు పురుగు ఆశించి ఉండే శిలీంద్రనాశినితోపాటు లీటరు నీటికి 3-5 మిల్లీ లీటర్లు మలాథియాన్ లేదా 2 మిల్లీ లీటర్లు మోనోక్రోటోఫాస్ లేదా ప్రొఫెనోపాల్ మందు కలిపితే మంచిది. తరువాత వాటిని ఆరబెట్టి నీరు మార్చి లీటరు నీటికి ఐదు గ్రాముల ట్రైకోడెర్మావిరిడి చొప్పున కలిసి ఆ ద్రావణంలో దుంప ముంచి ఆరబెట్టాలి. కేరళ భారత సుగంధ ద్రవ్యాల పరిశోధన సంస్థ తయారు చేసిన జీఆర్‌బి-35 అనే క్యాప్సూల్స్‌తో విత్తనశుద్ధి పైపాటుగా చేసుకుంటే దిగుబడి నాణ్యత పెరుగుతుంది. ఎకరానికి 8 క్యాప్సూల్స్ అవసరమవుతాయి.

**నాటే పద్ధతి ఇదీ..**

పసుపు కొమ్ము నాటేటప్పుడు, సమతుల మడి పద్ధతిలో కాకుండా ఎత్తుమడులు లేదా బోదెసాళ్ల పద్ధతి పాటిస్తే మొక్క వేర్లు, దుంప నీటిలో ఉండవు. దీంతో దుంపకుళ్లు నివారించుకోవచ్చు. ఎత్తుమడుల పద్ధతిలో మడికి.. మడికి మధ్య 30 సెంటమీటర్ల వెడల్పు కాల్వ ఉండేట్లు మీటరు వెడల్పు ఉన్న ఎత్తు మడులు తయారుచేసుకోవాలి. వరుసల మధ్య 30 సెంటీమీటర్లు, దుంపల మధ్య 15 సెంటీమీటర్లు ఎడం ఉండేలా నాటుకోవాలి. బొదెసాళ్ల పద్ధతిలో 45-60 సెంటీ మీటర్ల ఎడం ఉండే విధంగా బోదెలు తయారు చేసుకుని వాటిపై 20 సెంటీ మీటర్ల ఎడం ఉంచి దుంపలు నాటుకోవాలి. రెండు వరుసల మధ్య ఉన్న సాలు ద్వారా నీటిని అందిస్తే బోదె నీటిని పీల్చుకుంటుంది, డ్రిప్‌లో ఇవ్వడం లాభదాయకం.

**ఎరువుల యజమాన్యం ఇలా...**

పంటలో ఆఖరు దుక్కిలో ఎకరాలకు పది టన్నుల పశువుల ఎరువు, 200 కిలోల ఆముదం పిండి, 4 టన్నుల వర్మీ కంపోస్టు, పది కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలి, నాటిన 40 రోజులకు ఎరకాలకు 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి. తరువాత 80 మరియు 120 రోజులకు 50 కిలోల చొప్పున యూరియా, 25 కిలోల చొప్పున మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువు పైపాటుగా వేసుకోవాలి. ఇనుప ధాతు లోపం ఉన్నప్పుడు 5 గ్రాముల పెర్రస్ సల్ఫేట్ లీటరు నీటికి, జింక్‌లోపు నివారణకు 5 గ్రాముల జింక్ సల్ఫేట్, లీటరు నీటికి కలిసి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

**జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు**



పసు పుంట సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. సరైన విత్తన ఎంపికతోపాటు సరైన సమయంలో ఎరువు వాడుకోవాలి. అలాగే అధికారుల సూచన, సలహాలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చు. – డాక్టర్ వీరయ్య, కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్, కడప

### రాయచోటికి నేడు మంత్రి రాక

రాయచోటి : రాష్ట్ర రోడ్డు రవాణ శాఖ, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం రాయచోటికి రానున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పర్యటన వివరాలు కలెక్టర్ కార్యాలయానికి అందాయి. శనివారం ఉదయం రోడ్డు మార్గాన కావలి నియోజకవర్గానికి చేరుకుని అక్కడి నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు రాయచోటికి వస్తారు. అక్కడ మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలను కలుసుకుంటారు. రాత్రికి స్థానికంగా జరిగే కొన్ని కార్యక్రమాలలో పాల్గొంటారు.

### ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు


ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన ప్రహరీ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

మదనపల్లె : 'ప్రభుత్వ స్థలం కబ్జా' శీర్షికతో సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్తా కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. శుక్రవారం మండల తహసీల్దారు రమాదేవి ఆదేశాలతో వీఆర్వో మాధవరెడ్డి, సచివాలయ సర్వేయర్ భాస్కర్ వెంకప్పకోట గ్రామానికి వెళ్లారు. సర్వేనెం .5/2లో కోట్ల విలువ చేసే స్థలంలో కబ్జా రాయుళ్లు వేసిన కాంపౌండ్ వాల్‌ను తొలగించారు. ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.

### మద్యం, నాటు సారా ధ్వంసం


మద్యం ధ్వంసం చేస్తున్న పోలీసులు

మదనపల్లె : తనిఖీల్లో పట్టుబడిన అక్రమ మద్యం, నాటు సారాను పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నమోదైన 59 కేసుల్లో రూ.2,83,050 విలువచేసే 31.22 లీటర్ల మద్యం సీసాలు, 547.2 లీటర్ల నాటు సారా పట్టుబడింది. మండలంలోని బసినికొండ కనుమ వద్ద గంగమ్మగుడి సమీపంలో ఎస్ఈబీ ఈఎస్ వి.శ్రీనివాసులు, డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వలీబాషు, నిమ్మనపల్లె ఎస్ఐ లోకేష్ రెడ్డి, పోలీస్, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎరువుల విక్రయం నిలిపివేత

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలో వివిధ ఎరువుల దుకాణాలను కర్నూలు వ్యవసాయశాఖ ఏడీఏ సాలురెడ్డి, విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రూ.2,98,585ల విలువ చేసే 37.976 టన్నుల ఎరువులను ఎవరికీ విక్రయించరాదని ఆదేశించారు. శ్యాంపిల్స్ తీసి నాణ్యతా ప్రమాణాల పరీక్షకు ల్యాబ్‌కు పంపారు. విత్తన కంపెనీలో రికార్డులను, విత్తనాల ప్రాసెసింగ్ పరికరాల పనితీరును వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్ర నాయక్, ఏఎవో దివాకర్, ఏవో బివి మోహన్, ఇతరా సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల అదృశ్యం కేసులపై ప్రత్యేక దృష్టి


పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : మహిళలు, బాలికల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అదృశ్యమైన వారి జాడ తెలుసుకుని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చాలని వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్'లో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అదృశ్యమైన వారి ఆచూకీ కనుగొనేందుకు ప్రత్యేక టీమ్‌లు రాష్ట్ర, దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి విచారణ చేయాలని ఆదేశించారు. గంజాయి నిర్మూలనకు వందరోజుల కార్యాచరణ ప్రణాళిక మేరకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. రౌడీ షీటర్లపై నిఘా వుంచాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని ఆదేశించారు. ఎర్ర చందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిఘా పెంచాలన్నారు. దొంగతనాల నిరోధానికి గస్తీ ముమ్మరం చేయాలనీ ఆదేశించారు. పెండింగ్‌లో వున్న నాన్ బెయిలబుల్ వారంట్లను అమలు చేసేందుకు చర్యలు వేగవంతం చేయాలని వివరించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, డీఎస్పీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉత్తర్వులు పునఃసమీక్షించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ విద్యా శాఖ పరిధిలోకి పురపాలక, నగరపాలక పాఠశాలలను తీసుకువస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను పునఃసమీక్షించాలని ఎస్టీయూ నాయకులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డి, రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప ఎస్టీయూ కార్యాలయంలో నగర అధ్యక్షుడు ఆలీ అధ్యక్షతన చర్చా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ చర్చా వేదికలో పాల్గొన్న వారంతా ముక్త కంఠంతో జీవో నెంబర్ 84ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ విద్యా శాఖలో మున్సిపల్ పాఠశాలలు తీసుకున్నప్పటికీ ఇంతవరకూ ఏ ఒక్క కొత్త పోస్టు మంజూరు చేయలేదన్నారు. కడప నగర పాలకకు 30 పోస్టులు అదనపు అవసరం ఉన్నప్పటికీ ఒక్క పోస్టు మంజూరు చేయకపోవడం విచారకరమన్నారు. నగర పాలక సంస్థ ప్రత్యేక చొరవతో గత ఏడాది సుమారు 98 విద్యా వాలంటీర్లను నియమించడంతో బోధన సజావుగా నడిచిందన్నారు. మున్సిపల్, నగరపాలకలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఏ ఒక్కరికీ ఇంతవరకూ బదిలీలు, పదోన్నతులు జరపలేదన్నారు. జీతాల కోసం కూడా ఎంఈఓ ఆఫీసు చుట్టూ తిరగడం తప్ప ఎటువంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అసంబద్ధ జీవో నెంబర్ 84ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నగర ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, ఆర్థిక కార్యదర్శి అస్లాం, జిల్లా నాయకులు బాబు పద్మాకర్, జిటి.దామోదర్, ప్రకృద్దీన్, శ్రీనివాసులు, రాజగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, ఆసిఫ్, ఖాసీం, హర్షద్, ఖాదర్‌భాష, ఖాజాపీర్, రాజశేఖర్‌నాయక్, సికిందర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

### 3500 లీటర్ల సారా ఊట..


సారా ఊట ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కేవీపల్లె : మండలంలోని జిల్లేళ్లమంద అటవీ ప్రాంతంలో 3500 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు పీలేరు సెబ్ సీఐ శ్యాంప్రసాద్ తెలిపారు. పీలేరు సెబ్, రాయచోటి స్పెషల్ టీం జిల్లేళ్లమంద సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లపు ఊట ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది శేఖర్, సుధాకర, సురేష్, రమేష్, చందు, నాగేంద్ర, శివసుదర్శన్‌రావు, సునీల్ సుకుమార్ పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం లారీని పట్టుకున్న పోలీసులు, అధికారులు

రామాపురం : కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు తరలిస్తున్న 553 బస్తాల రేషన్ బియ్యం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. బండపల్లె పంచాయితీ పరిధిలోని టోల్ గేట్ వద్ద పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. బియ్యం ఉన్న లారీతోపాటు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రాయచోటికి తరలించి.. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### ఆ భక్తులే చోరీ చేశారా?

బద్వేలు అర్బన్ : బద్వేల్-కడప రహదారిలోని బయనపల్లె సమీపంలోని ప్రధాన రహదారిపై శ్రీరామ భక్త ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం జరిగిన చోరీ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని చింతలచెరువు పంచాయతీ బయనపల్లె శ్రీరామభక్త ఆంజనేయస్వామి ఆలయానికి గురువారం 11-30 గంటల సమయంలో మరో వాహనంలో వచ్చిన 9 మంది గుర్తు తెలియని పురుషులు, మహిళలు, పిల్లలు తిరుపతికి వెళుతున్నామని, ఆలయం వద్ద కొద్దిసేపు సేద తీరుతామని తెలిపారు. పూజారి సరేనని చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. వారిలో కొందరు పూజారి భార్యతో మాట్లాడి టీ చేసి ఇవ్వాలని అడగడంతో ఆమె ఇచ్చింది. అనంతరం వారు వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత పూజారి ఆలయం లోపలికి వెళ్లి చూడగా మూల విరాట్ వెండి పాదాలు, వెండికళ్ళు, వెండికిరీటం, వెండి గదతో పాటు అమ్మవారి బంగారు తాళిబొట్టు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గ్రహించి గ్రామ పెద్దలకు విషయం తెలియజేశాడు. వచ్చిన వారిపై అనుమానంతో పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అట్లూరు ఫారెస్టు చెక్‌పోస్టు సమీపంలోని సీసీ కెమెరాలో నిందితులు వచ్చిన కారును గుర్తించినట్లు తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Sc, P.B.B.Sc, GNM, DMLT, DOA, DRGA, DIALYSIS, DMST అడ్మిషన్లు జరుగుతున్నవి. సీట్లు పరిమితం. స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. వివరాలకై సంప్రదించండి Aayushman Group Of Institutions, సెల్: 98495 65780.

SERIVCES

CHANGE OF NAME

Pathan Reddy Munna. అను నా పేరును Pathan Ayesha గా మార్చుకోబడినది. నా చిరునామా: Pathan Ayesha W/o Pathan Ali Khan R/o D.No: 18/148, Karimiya Masjid Street, Kothapalli, Rayachoty (Town & Mandal), Annamayya (District), A.P.

WANTED

Wanted workers for retail store 8688074484, 10th class (able to read and write)

TKR Jeevan Jyothi School, Jammalamadugu Wanted (Local) Teachers to work in our school as a Maths teacher 3rd, 4th and 5th class. Cont : 9603737014

కడప నగరంలోని ఆర్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు నర్సరీ నుండి ఐదవ తరగతి వరకు బోధించుటకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కావలెను. సెల్: 8074717196, 8106123469

బిస్కట్/చాక్లెట్ ఏజన్సీ నందు పనిచేయుటకు సేల్స్‌మేన్/డెలివరి బాయ్ కావలెను. కడప నగరంలో నివసించు మగవారు మాత్రమే సంప్ర. సెల్: 9494035777, 9391802277

కొత్తగా ప్రారంభించిన మా బ్రాంచిలో పనిచేయుటకు 59 స్త్రీ/పు కావలెను. నో ఫీజు. జీతం: 14 వేలు+DA 8 వేలు+ఫ్రీ రూం, 2వ సం॥లోపు. సంప్ర. సింధూ ప్రమోషన్స్ చెన్నూరు బస్టాండ్ దగ్గర, కడప. 86880 65411

Lucky Fast Foods : హయత్ నగర్, హైదరాబాద్ వారికి రాగి సంకటి, నాటు కోడి కూర, fish fry & chicken fry వంట మాస్టర్ కావలెను. Ph: 9885409786

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K సంప్ర : 9640258899, 9640468899

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్స్ చేయుటకు స్త్రీ/పు కావలెను. డైలీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 85026 15217

Wanted Physics & Biology For IIT English Teachers, Primary Teacher (ladies) for 5th Class Attractive Salaries Attend Directly, Kadapa. Ph: 8555944388 / 8374290230

ప్యాక్లోప్ కాడMP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. 7995365999


సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

### అటవీ స్థలంలో ఇసుక తరలింపు

ప్రొద్దుటూరు : మండలంలోని నంగూరుపల్లె సమీపంలో ఉన్న అటవీ స్థలంలో శుక్రవారం పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తున్నారు. గతంలో అటవీ శాఖ అధికారులు ఎకో పార్కుకు స్థలాన్ని గుర్తించి ప్రహరీ నిర్మించారు. నంగనూరుపల్లె, మీనాపురం గ్రామాలకు చెందిన కొంతమంది అధికార పార్టీ నాయకులు ఏకో పార్కు ప్రహరీని కూల్చి జేసీబీతో ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టారు. పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుక తరలిపోతుండటంతో స్థానికులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం సాయంత్రానికి అక్రమ ఇసుక రవాణాకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. మండల పరిధిలోని పెన్నానది పరివాహక ప్రాంతాల్లో పలు చోట్ల ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోందని గ్రామీణ ప్రజలు చెబుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తాము అధికార పార్టీ నేతలమని చెబుతున్నారు.

### రైలు కిందపడి వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫాం పడమర వైపు దిగువన రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందాడని రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. సీఐ కథనం మేరకు...65-70 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తి మృతుడి ఆచూకీ తెలియరాలేదని, గుర్తు పట్టినవారు కడప రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామని సీఐ వివరించారు.

### వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె సమీపంలోని మోటారు బైక్‌ను వెనుకవైపు నుంచి లారీ ఢీనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు.. చిలమకూరు గ్రామానికి చెందిన సుంకన్న, పుల్లయ్య గురువారం రాత్రి ముద్దనూరుకు వచ్చి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఇరువురికీ స్వల్ప గాయాలయ్యాయి. మరో సంఘటనలో నొస్సంవారిపల్లెకు చెందిన శ్రీకాంత్ ప్రొద్దుటూరు నుంచి ఇంటికి బైక్‌లో ప్రయాణిస్తున్నాడు. తిమ్మాపురం వద్ద అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

### విద్యుత్తు తీగలు తెగి గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

వీరపునాయునిపల్లె : మండలంలోని కొమ్మద్ది గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుత్తు తీగలు తెగిపడిన ఘటనలో మూడు గొర్రెలు మృతిచెందాయి. కొమ్మద్ది గ్రామానికి చెందిన కొత్తమిద్దె చిన్నరాములయ్య పాకలో గొర్రెలు ఉంచాడు. పాకపై ఉన్న విద్యుత్తు తీగలు ఒక్కసారిగా తెగి పడడంతో షాక్‌కు గురై మూడు గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.1.5లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాములయ్య కన్నీటి పర్యంతమయ్యారు.

## గిరిజనుల భూమి కబ్జా

- రాత్రికి రాత్రి మామిడి చెట్లు నాటేశారు
- తహశీల్దారుకు బాధితుల ఫిర్యాదు


తమ భూమిలో మామిడి చెట్లు నాటారని చెబుతున్న గిరిజనులు

వీరబల్లి : గిరిజనులు పంటలు సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న భూమిని ఓ నాయకుడు దౌర్జన్యంగా కబ్జా చేసి రాత్రికి రాత్రే మామిడి చెట్లు నాటేశారు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితులు తహసీల్దారును ఆశ్రయించారు. బాధితుల వివరాల మేరకు... మండలంలోని తాటికుంటపల్లి పంచాయతీ కొత్తపల్లికి చెందిన గిరిజనులకు గతంలో డీకేటీ భూములు ప్రభుత్వం అందజేసింది. కొందరు గిరిజనుల వద్ద ఇటీవల రాజగోపాల్‌రెడ్డి అనే వ్యక్తి ఆరు ఎకరాల డీకేటీ భూమిని కొనుగోలు చేశారు. ఆ భూమి సాగు చేసుకుంటున్న ఆయన ప్రక్కనే ఉన్న ఇతర గిరిజనుల భూములను కబ్జాచేశారు. రాత్రికి రాత్రే మామిడి చెట్లు నాటారు. దీంతో గిరిజనులతో కలిసి ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ నాయక్ సమస్యను మండల ఇన్‌ఛార్జి తహశీల్దారు నారాయణస్వామికి విన్నవించారు. కొనుగోలు చేసిన భూమిలో మామిడి మొక్కలు నాటకుండా ఆయనకు సంబంధం లేని ఇతరుల భూమిని ఆక్రమించి మామిడి చెట్లు నాటడం ఎంతవరకు న్యాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాధారంగా ఉలవ, వేరుశనగ, కంది పంట పండించుకుంటూ జీవనం సాగించేవారమని, గత ఏడాది, ప్రస్తుతం వర్షాలు లేక భూమిని సాగు చేయకుండా అలాగే ఉంచామని తెలిపారు. తమ భూమి ఆక్రమణకు గురి కాకుండా న్యాయం చేయాలని తహసీల్దారును కోరారు. ఆయన స్పందించి కబ్జాదారుడితో ఫోన్‌లో మాట్లాడారు. గిరిజనుల భూమిని వారికే ఇవ్వాలని, మామిడి మొక్కలు తొలగించకపోతే కేసు నమోదు చేసి డీకేటీ భూమిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

## సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలి


గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న జేసీ, తదితరులు

రాయచోటి : మెరుగైన భవిష్యత్తు నిర్మాణానికి సహకార సంఘాలు పునాది లాంటివని, జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 6న అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో కలిసి గోడపత్రికలను జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వ మానవాళి ఉజ్వల భవిష్యత్తు నిర్మాణంలో సహకార సంఘాలు అనే నినాదంతో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని జరుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి గురుప్రకాష్ రావు, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, ప్రొద్దుటూరు సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సహకారశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**సమన్వయంతో విధులు నిర్వహించాలి**

హౌసింగ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి పేదల సొంతింటి కలను నెరవేర్చాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో గృహ నిర్మాణసంస్థ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గృహనిర్మాణ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. అందరూ సమన్వయం చేసుకుని వెంటనే పురోగతి సాధించేలా చూడాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులు, సిబ్బంది కేక్ కట్ చేసి జాయింట్ కలెక్టర్‌ను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.